నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 30 జూన్ 2024 | HYDERABAD




కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 'జిల్లా గణాంక దర్శిని-2023'ని ఆవిష్కరించారు. హైదరాబాద్ ముఖ్య ప్రణాళికాధికారి డా. సురేందర్ పాల్గొన్నారు. - సిటీబ్యూరో

## ఫలించిన కేసీఆర్ ప్రభుత్వ కృషి..

### బల్దియాలో కంటోన్మెంట్ విలీనానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

### సివిల్ ఏరియా ఆస్తులు, మౌలిక వసతులు.. ఉచితంగా గ్రేటర్‌కు బదిలీ..

సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన పాలనలో సీఎంగా చేసిన కృషి ఫలించింది. అప్పటి మంత్రి కేటీఆర్ కేంద్రంపై తెచ్చిన ఒత్తిడి మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు జీహెచ్‌ఎంసీలో విలీనం కానున్నది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ బోర్డు ఈనెల 25న జరిగిన బోర్డు మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకున్నారు. బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలో ఉన్న మౌలిక వసతులు, ఆస్తులను జీహెచ్‌ఎంసీకి బదిలీ చేయనున్నారు. ఉచితంగానే ఈ ప్రక్రియ పూర్తికానున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపి చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖ బోర్డు అధికారులను ఆదేశించింది. బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దుచేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకున్నది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25న కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ విలీన ప్రక్రియ వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కేంద్ర రక్షణ శాఖ అందుకు సంబంధించిన విధి విధానాలపై లేఖ రాసింది. దీని ప్రకారం కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి సౌకర్యాలు, మౌలిక వపతులు అన్నీ ఉచితంగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికి దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది.



## తపన ఉంటేనే విజేతలవుతారు..

### అదనపు డీజీ మహేశ్ భగవత్

ముషీరాబాద్, జూన్ 29: పోటీతత్వంతో కూడిన ప్రయత్నం విజయాన్ని సాధించిపెడుతుందని అదనపు డీజీ మహేశ్ భగవత్ అన్నారు. దోమలగూడ రామకృష్ణమఠంలో జరుగుతున్న శౌర్య శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సాధించాలనే తపన ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలరని, ప్రయత్నిస్తే విజేతలుగా మిగులుతారని లేదా అనుభవజ్ఞులవుతారన్నారు. యూపీఎస్‌సీ విద్యార్థులకు ఇంటర్వ్యూను ఎదుర్కొనేలా ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఇటీవల 1016 మందికి ఉచిత కోచింగ్ ఇవ్వగా, 216 మంది క్వాలిఫై అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సమయ పాలన, ఆర్థిక పొదుపు, టెక్నాలజీ వినియోగంపై చిట్కాలు చెప్పారు. రామకృష్ణమఠం అధ్యక్షుడు బోధమయానంద తదితరులు పాల్గొన్నారు.

## 'టచ్ ఏ లైఫ్' ..

కొండాపూర్, జూన్ 29 : నిరుపేద బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న 'టచ్ ఏ లైఫ్' ఫౌండేషన్ పదో వార్షిక వేడుకలను స్పర్శ పేరిట శనివారం నాలెడ్జ్ సిటీలోని టీ -హబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విభూతి జైన్, రినా హిందోచా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్పర్శ ఒక సంఘటన కాదని, విద్య ఒక్క పరివర్తన శక్తికి నిదర్శనమన్నారు. టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ ద్వారా వెనుకబడిన బాలికలకు సాధికారతను కల్పిస్తున్నామని, తద్వారా ఉజ్వల భవిష్యత్‌ను అందించేందుకు మార్గాన్ని కల్పిస్తున్నామన్నారు. వార్షిక వేడుకల్లో భాగంగా ఫౌండేషన్ అందిస్తున్న సేవలను డాక్యుమెంటరీ, పలు కార్యక్రమాల ద్వారా విభిన్న రూపాల్లో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పేద బాలికలు, వారి కుటుంబాలు, వలంటీర్లు, దాతలు పాల్గొన్నారు.





వెండి కొండల లాంటి మబ్బులు..నీటిలో ప్రతిబింబమై.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమైంది. సరూర్‌నగర్ చెరువులో కనువిందు చేసింది.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేం

## ఆ పని స్థానిక సంస్థలదేనంటున్న హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): తాంబూలాలిచ్చేశాం... తన్నుకు చావండి అన్నట్లుగా ఉన్నది హెచ్‌ఎండీఏ తీరు. భవన నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు ఇచ్చేసి.. ఆ తర్వాత నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేస్తున్నారా? లేదా అన్న అంశాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు.. అది తమ బాధ్యత కాదని చెబుతున్నారు. తాము ఇచ్చిన అనుమతుల ప్రకారం భవన నిర్మాణాలు, లే అవుట్లలో అభివృద్ధి పనులు జరుగుతున్న విధానాన్ని స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పర్యవేక్షించి, అవసరమైతే కూల్చివేసే అధికారం వాటికే ఉన్నదని హెచ్‌ఎండీఏ పేర్కొంటోంది. హెచ్‌ఎండీఏ తీరు ఇలా ఉంటే...స్థానిక సంస్థల అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా గట్టిగా నిలదీసినా, ఫిర్యాదు చేసినా అనుమతులు హెచ్‌ఎండీఏ ఇచ్చిందంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారే తప్ప.. తమకు ఉన్న అధికారాలను సద్వినియోగం చేయడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో వేలాదిగా భవన నిర్మాణాలు, లే అవుట్ల అభివృద్ధి పనులు అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్నాయి. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా పనిచేయాల్సిన హెచ్‌ఎండీఏ..ఇందుకు భిన్నంగా పనిచేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

### పర్యవేక్షణ మరిచిన స్థానిక సంస్థలు...

గ్రేటర్ చుట్టూ ఉన్న హెచ్‌ఎండీఏ పరిధి మొత్తం 7 జిల్లాల్లో ఉన్నది. ఇందులో సుమారు 40 దాకా మున్సిపాలిటీలు, 1032 గ్రామాలు ఉన్నాయి. భవన నిర్మాణాలు, లే అవుట్ల కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసి 4 జోన్లుగా విభజించి అనుమతులు ఇస్తున్నారు. అయితే హెచ్‌ఎండీఏ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలను స్థానిక సంస్థలైన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు నిరంతరం పర్యవేక్షించాలి. నిర్మాణం జరుగుతున్న సమయంలో సైట్‌కి వెళ్లి నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు లేకుంటే చర్యలు తీసుకోవాలి. అయినా అలాంటి చర్యలు మచ్చుకైనా కనిపించడం లేదు. పెద్ద ఎత్తున ఫిర్యాదు చేసి, ఉన్నతస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తే తప్ప.. అక్రమ నిర్మాణాలను ఏ మాత్రం అడ్డుకోవడం లేదని ఆరోపణలు శివారు ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి. అనుమతులు ఇచ్చేది ఒకరు, పర్యవేక్షించేది మరొకరు కావడంతోనే అక్రమ నిర్మాణాలు, ముఖ్యంగా సెట్ బ్యాక్ లేకుండా ఇండ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన నిర్మాణానికి సంబంధించి నిబంధనల ప్రకారం కొత్తగా నిర్మించే భవనం చుట్టూ 1.5 మీటర్ల సెట్ బ్యాక్‌తో నిర్మాణాలు చేపట్టాలి. కానీ ఈ నిబంధనను 90 శాతం భవనాల్లో అమలు చేయడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

### నిబంధనలకు తూట్లు...

రాష్ట్రంలో అమలవుతున్న భవన నిర్మాణ నిబంధనలకు నిర్మాణదారులు తూట్లు పొడుస్తున్నారు. మెరుగైన పట్టణీకరణే లక్ష్యంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో 168ను భవన నిర్మాణాలు, లే అవుట్ల విషయంలో అమలు చేస్తోంది. గాలి, వెలుతురు వచ్చేలా, విశాలమైన రోడ్లు ఉండేలా ఇండ్లను నిర్మించాల్సిన చోట హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొందిన వారు అందులో పొందుపర్చిన నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో ఇండ్ల మధ్య సెట్ బ్యాక్‌లు సరిగా లేకపోవడంతో అందులో నివాసముండే వారు ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



శనివారం మాదాపూర్‌లో నాలాను పరిశీలిస్తున్న బల్దియా విజిలెన్స్ కమిషనర్ ఏవీ రంగనాథ్

## వరద నీరు నిలవద్దు

సిటీబ్యూరో: వరద నీరు నిలిచే ప్రాంతాలపై దృష్టి పెట్టి, యుద్ధప్రాతిపదికన సమీపంలో ఉండే క్యాచ్ పిట్స్, మ్యాన్ హోల్స్‌ను మెరుగుపరచాలని బల్దియా విజిలెన్స్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలో పర్యటించిన ఆయన మ్యాన్ హోల్స్, వాటర్ లాగింగ్ ఏరియాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాన్ హోల్స్, క్యాచ్‌మెంట్ పిట్స్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఉన్న 140 వాటర్ లాగింగ్ పాయింట్లపై దృష్టి పెట్టిన ఆయన... కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. మాదాపూర్‌లోని వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలించిన ఆయన... వర్షం నీరు ప్రవాహ వేగాన్ని తగ్గించేలా పేరుకుపోయిన చెత్తా, ఇసుక తొలగించాలని సూచించారు.

## 'తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలి'



ప్రొఫెసర్ నాగేశ్వర్

చిక్కడపల్లి, జూన్ 29: పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ 'నగరీకరణ- ప్రభుత్వ విధానాలు- ప్రత్యామ్నాయాలు ' అనే అంశంపై శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. శ్రామికులు లేకుండా నగరాల అభివృద్ధి లేదని, శ్రామికులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మెట్రో రైల్‌పై సమీక్ష చేసిన సీఎం సామాన్యులకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్ రైళ్లపై సమీక్షించాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. నగరంలో మురికివాడల్లో సదుపాయాలు పెంచే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

## పనుల్లో వేగం పెంచండి..

సిటీబ్యూరో, జూన్ 29 ( నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్ జిల్లాలో చేపట్టిన వంద పడకల వైద్యశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజినీర్లు, డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వైద్యశాలలో ఓపీడీ, కొత్త బ్లాక్ నిర్మాణ పనులు, సీతాఫల్‌మండీలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కామటిపురలో వంద పడకల వైద్యశాల, చార్మినార్ ప్రభుత్వ నిజామియా కాలేజీ, జనరల్ వైద్యశాలల పునర్నిర్మాణ.. పునరుద్ధరణ పనులు, గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, యాకత్‌పురలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడలో 50 పడకల ఆస్పత్రి తదితర నిర్మాణ పనులపై ఆరా తీశారు. టెండర్ జరగని పనుల్లో త్వరితగతిన ఆ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎన్‌ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతి రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో పలుచోట్ల జల్లులు

### రాగల మరో రెండు రోజులు వర్ష సూచన



సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. ఆవర్తనం కొనసాగుతుండటం వల్ల రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.6, కనిష్ఠం ఉష్ణోగ్రతలు 24.8 డిగ్రీలు, గాలిలో తేమ 60 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.






# పారబోస్తున్నా..పట్టించుకోవట్లే..

## డంపింగ్ యార్డుగా..ఔటర్ సర్వీసు రోడ్లు



ఔటర్ సర్వీసు రోడ్డు వెంట పారబోసిన భవన నిర్మాణ వ్యర్థాలు

సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్ అంటేనే ఆధునికతకు మారుపేరు. అలాంటి కారిడార్‌లో ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల నిర్వహణపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు హెచ్‌ఎండీఏ యంత్రాంగం. గచ్చిబౌలి నుంచి నానక్‌రాంగూడ మీదుగా నార్సింగి, మంచిరేవుల వరకు ఉన్న ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్ల పక్కన ఖాళీ స్థలాలు డంప్ యార్డుగా మారుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జోరుగా జరుగుతుండటంతో అక్కడి వ్యర్థాలను తీసుకొచ్చి సర్వీసు రోడ్ల వెంబడి ఉన్న ఖాళీ ప్రాంతాల్లో పడేస్తున్నా.. అడిగే వారే ఉండటం లేదు. గ్రేటర్ చుట్టూ మహానగరానికి మణిహారంలా ఉన్న ఔటర్ రింగు రోడ్డును సమర్థవంతంగా నిర్వహించాల్సిన అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ రోడ్డు నిర్వహణను చూడాల్సిన అధికార యంత్రాంగం ఆఫీసులకే పరిమితమవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో రోడ్లను పరిశీలిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు అటు వైపే కన్నెత్తి చూడటం లేదు.

### రాత్రి వేళల్లో డంపింగ్...

ఔటర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డు వెంబడి మొక్కలు నాటి సంరక్షించాల్సిన అధికారులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యారు. ఓఆర్‌ఆర్ నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అలాంటి పనులు చేపట్టడం లేదు. రాత్రి వేళల్లో భారీ నిర్మాణ సైట్ల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి పారబోస్తున్నారు. అదే సమయంలో మట్టి, కంకరతో పాటు ఇతర నిర్మాణ సామగ్రి ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్లపై పడుతోంది. ఈ క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి ఎక్కువగా పడి.. దుమ్ము, ధూళి ఎక్కువగా వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, నార్సింగి ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్లపై వెళ్లాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించి భవన నిర్మాణ వ్యర్థాలను సర్వీసు రోడ్ల వెంట వేయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.